**సమస్యలుంటే సాక్షికి చెప్పండి**

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**91829 05602**

నంబర్‌లో సంప్రదించండి

## క్లుప్తంగా

### మరో రెండు రోజులు ఆధార్ ప్రత్యేక శిబిరం



పాత రేసపువానిపాలెం సచివాలయంలో ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

**సీతమ్మధార :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ వివరాల నమోదు, సవరణ చురుగ్గా జరుగుతోంది. సచివాలయాల్లో మంగళవారం ప్రారంభించిన ప్రత్యేక శిబిరాలు మరో రెండు రోజులపాటు కొనసాగుతాయి. ఈ మేరకు ఉత్తర నియోజకవర్గంలోని సీతమ్మధార సచివాలయంలో, 24వ వార్డు పాత రేసపువానిపాలెంలో గల 138వ నంబరు సచివాలయంలో రెండు రోజులుగా ఆధార్ సేవలు అందిస్తున్నారు. ఏడేళ్లలోపు పిల్లలకు పూర్తి ఉచితంగా వివరాలు నమోదు చేస్తున్నారు. ఇతరులు మాత్రం రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఈ కేంద్రాల్లో రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు ఆధార్ నమోదు ప్రక్రియ జరుగుతుంది. ఆధార్ బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉన్నవారంతా విధిగా సమీపంలోని సచివాలయంలో నమోదు చేసుకోవాలని జోన్ – 3 కమిషనర్ కె.శివప్రసాద్ కోరారు.

### సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

**సీతమ్మధార :** ప్రముఖ సినిమా సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఈ నెల 25న రాజేశ్వరరావు, కోటి స్వరపరిచిన చిత్రగీతాలతో సంగీత విభావరిని ప్రజలు జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కోరారు. ఫ్యామిలీ మెలోడీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం పోస్టర్‌ని బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల నివాసంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాల్లో సాలూరి రాజేశ్వరరావు చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ఫ్యామిలీ మెలోడీస్ సంస్థ కన్వీనర్ టి.శివనారాయణ మాట్లాడుతూ ఈ నెల 25న సాయంత్రం 4 గంటలకు అక్కయ్యపాలెం దాలిరాజు సూపర్‌మార్కెట్ పక్కన గల స్వరాలయ సినీ సంగీత స్టూడియోలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, గాయని తెలుగు మురళి కోమలి పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

**మురళీనగర్ :** జోన్ – 2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతినగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, బాబూజీనగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, రామ్‌జీ ఎస్టేట్స్, పెద కొత్తూరు, ఏఎస్సార్‌నగర్, జయప్రకాష్‌నగర్, సురేష్ రామ్‌నగర్, జగజ్జీవన్‌నగర్, అంబేద్కర్ నగర్, ఇందిరానగర్ 1 – 5 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

### 27న ఉచిత వైద్యశిబిరం

**మురళీనగర్ :** మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో స్థానిక వాకర్స్ పార్కులో ఈ నెల 27న ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ టి.రవికాంత్, దంత వైద్య నిపుణుడు డాక్టర్ గిరీష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ధీరజ్ పత్రి పాల్గొంటారని చెప్పారు. శిబిరంలో సాధారణ వ్యాధులతోపాటు, గుండె, దంత సబంధిత సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఆ రోజు బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బాబోయ్ ఏడాకుల చెట్లు!



సింగాలమ్మపురంలో సింగాలమ్మగుడి ఎదురుగా ఏడాకుల చెట్లు

- శ్వాస సంబంధిత వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికుల ఆందోళన
- తొలగించాలని కోరుతున్న 45వ వార్డు ప్రజలు

**తాటిచెట్లపాలెం :** పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన మొక్కలు మానవాళికి హాని కలిగిస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. ప్రాణవాయువును పంచుతాయనుకుంటే శ్వాస సంబంధిత వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయని భయపడిపోతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారుల పక్కన నాటిన ఏడాకుల చెట్లు ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నాయి. డెవిల్ ట్రీగా పిలవబడే ఏడాకుల చెట్లు హుద్‌హుద్ తుఫాను తర్వాత గ్రీన్‌ప్రాజెక్టులో భాగంగా విశాఖలో చాలా ప్రాంతాల్లో నాటారు. ఏడాకుల చెట్ల శాస్త్రీయ నామం ఆల్‌స్టోనియా స్కోలరిస్. ఈ చెట్లు ఏపుగా పచ్చగా పెరుగుతాయి. అయితే వీటి నుంచి వచ్చే వాసన మాత్రం మనుషుల ఆరోగ్యానికి హాని చేస్తుందని, తలనొప్పి, వికారం, ఊపిరితిత్తుల సమస్యలు, కొన్నిసార్లు క్యాన్సర్లు వచ్చే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటి ప్రభావం ఎక్కువగా శీతాకాలంలో ఉంటుందని చెబుతున్నారు. నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాలైన సింహగిరికాలనీ, సింగాలమ్మపురం ప్రాంతంలో ఏడాకుల చెట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటి వల్ల తమకు ప్రాణహాని ఉందని, వెంటనే తొలగించాలని స్థానికులు వాపోతున్నారు. ఈ చెట్ల వల్ల ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ తర్వాత వ్యాధుల తీవ్రత పెరిగిందని, పూత సమయంలో ఈ చెట్ల నుంచి వచ్చే గాలి ఆరోగ్యవంతులపైన కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని, చిన్నపిల్లలు ఆస్తమాకి గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



సింహగిరి కాలనీ పక్కన ఏడాకుల చెట్లు

#### ఏడాకుల చెట్లు తొలగించాలి



హుద్‌హుద్ సమయంలో నాటిన ఏడాకుల చెట్ల గాలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ గాలి పీల్చడంతోపాటు పూత సమయంలో వచ్చే వాసన వల్ల ఆస్తమా వంటి శ్వాసకోశ రోగాలతో ఇబ్బంది పడుతున్నాం. ఈ చెట్ల గాలి పీల్చడంతో ఆరోగ్యవంతులు సైతం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. ఇవి ప్రమాదకరమని తెలియడంతో చాలా ప్రాంతాల్లో తొలగించారు. మా ప్రాంతంలో మాత్రం నేటికీ తొలగించ లేదు. అధికారులు స్పందించి వెంటనే తొలగించాలి.

– ఎం.తిరుపతిరావు, సింహగిరికాలనీ

#### ఊపిరి తీసుకోలేకపోతున్నాం



ఏడాకుల చెట్ల పక్క నుంచి వచ్చేటప్పుడు వాటి గాలి పీల్చడంతో శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా ఉంటోంది. ఆస్తమా రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెట్లను తొలగించి, అవసరమైతే ప్రాణాలు కాపాడే మంచి మొక్కలు నాటాలి.

– ఎం.మణి, సింహగిరికాలనీ

#### అనారోగ్యానికి గురయ్యారు



ఏడాకుల చెట్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే చాలా మంది అనారోగ్యానికి గురయ్యారు. ఈ సీజన్‌లో మరీ ఎక్కువగా వ్యాధులు ప్రబలుతున్నాయి. ఆ చెట్ల పక్క నుంచి రాకపోకలు సాగించే సమయాల్లో గాలి పీల్చడం ఇబ్బందిగా ఉంటోంది. ఆరోగ్యాన్ని హరించే ఈ చెట్లను అధికారులు తొలగించి మా ప్రాణాలు కాపాడాలి.

– చిన్నారావు, సింగాలమ్మపురం

## యూజీడీ కోసం తవ్వి.. వదిలేశారు..!



రోడ్డుపైనే వదిలేసిన మట్టికుప్పలు

**సీతమ్మధార :** జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు సుందరీకరణ పూర్తిగా దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) కోసం రోడ్డు పొడవునా పబ్లిక్ వర్క్స్ విభాగం గోతులు తవ్వింది. అనంతరం నెలలు గడుస్తున్నా సరే గోతుల కోసం తవ్విన మట్టికుప్పలు అలాగే వదిలేశారు. ఫలితంగా వర్షాలు కురిసినప్పుడు రోడ్డంతా బురదమయంగా తయారవుతోందని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డుపైనే మట్టికుప్పలు వదిలేయడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సిన పరస్థితి నెలకొంది. దీంతో కొంతమంది రాంగ్‌రూట్‌లో సైతం వెళ్లిపోతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో మెకానిక్ షెడ్ల వద్ద రోడ్డుపైనే అధికసంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. మరోవైపు మట్టికుప్పలు పేరుకుపోయాయి. ఫలితంగా రోడ్డుపై వాహనాలు చాలా నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. డివైడర్‌పైన మొక్కలపై సైతం మట్టికుప్పలు వేసేయడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జోన్ – 3 యూజీడీ విభాగం ఇంజినీర్లు స్పందించి మట్టికుప్పలు వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### పథకాల అమలులో యూసీడీ పాత్ర కీలకం

**సీతమ్మధార :** జీవీఎంసీ జోన్ – 3 (ఆశీలమెట్ట) యూసీడీ విభాగం ఏపీడీగా ఇటీవల నియమితులైన ఎల్.రాము బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పొదుపు సంఘాలను పటిష్టం చేయాలని కోరారు. అర్హులైన మహిళలందరూ విధిగా పొదుపు సంఘాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంక్ లింకేజీ రుణాలు, స్వయం ఉపాధి రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. టిడ్కో దరఖాస్తుదారులకు త్వరితగతిన డిపాజిట్లు వాపస్ చేయాలని సూచించారు.

## రోడ్డుపైనే దుకాణాలతో ట్రాఫిక్‌జామ్



దుకాణాల ఆక్రమణతో కుచించుకుపోయిన రైతుబజార్ రోడ్డు

**సీతమ్మధార :** స్థానిక రైతుబజార్ రోడ్డుపై దుకాణాల ఏర్పాటుతో రాకపోకలకు మార్గం కుచించుకుపోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీతమ్మధార నుంచి తూర్పు వైపునకు వెళ్లే రోడ్డు నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును ఆక్రమించి నిమ్మకాయలు, పండ్లు, కొబ్బరికాయులు, పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలకు అవకాశం లేక నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోంది.

ఈ రోడ్డులోనే జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఉద్యోగుల వసతి గృహం కూడా వుంది. దీంతో వసతిగృహం సిబ్బంది, ఉద్యోగినులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి కేఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం, ఎంఎంటీసీ కాలనీకి వెళ్లేందుకు వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. దుకాణాల వద్ద వాహనాలు ఆపి కొనుగోలు చేసే సమయంలో ఈ రోడ్డంతా హారన్ల మోతతో దద్దరిల్లిపోతుందంటే అతిశయోక్తి కాదు. రైతుబజార్‌కి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఈ రోడ్డులోనే పార్కింగ్ చేస్తారు. పైగా రోడ్డుకి రెండువైపులా తోపుడుబండ్లు కూడా అధిక సంఖ్యలో ఉంటాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఈ మార్గంలో ఆక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించి, వాహనాల రాకపోకలకు మార్గం సుగుమం చేయాలని పలువురు కోరుతున్నారు.

### సౌర విద్యుత్‌తోనే భవిష్యత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

**సీతమ్మధార :** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో మొట్టమొదటి రూఫ్‌టాప్ సోలార్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఫ్రేయర్ ఎనర్జీ సంస్థ సీతమ్మధార కేఎస్‌ఆర్ ప్లాజాలో ఏర్పాటు చేసింది. ఈ సెంటర్‌ను విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంస్థ ఏర్పాటు పర్యావరణ అనుకూల, స్వచ్ఛమైన ఇంధనాన్ని స్వీకరించడానికి ఒక ముందడుగుగా నిలుస్తుందన్నారు. సౌర విద్యుత్‌పై ఆధారపడిన వ్యాపారాలను బలోపేతం చేయడంతోపాటు హరిత భవిష్యత్‌కు దోహదపడుతుందని కొనియాడారు. ఈ కేంద్రం మరింత పర్యావరణ అనుకూల భవిష్యత్ కోసం అందరినీ ప్రేరేపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫ్రేయర్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ మర్ధా, డైరెక్టర్ రాధిక చౌదరి పాల్గొన్నారు.

## విదేశీ విద్యార్థుల హాస్టల్ పరిశీలన



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

**విశాఖ సిటీ:** ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను బుధవారం మధ్యాహ్నం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఏయూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు సహకారం అందిస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో హాస్టల్స్‌లో చేపట్టిన మరమ్మతులు, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్ వివరించారు. హాస్టల్ అభివృద్ధికి అవసరమైన సంపూర్ణ సహకారాన్ని సత్వరమే అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, దూర విద్య సంచాలకుడు ఆచార్య ఎస్.విజయమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ సిహెచ్.ఆశ ఇమ్మానియల్ రాజు, డీన్లు ఆచార్య భాస్కర్‌రెడ్డి, ఆచార్య ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### 15న రాధాకృష్ణ మహోత్సవాలు

**మల్కాపురం:** వచ్చే నెల 15న ఆర్‌కే బీచ్ సమీప గోకుల్ పార్కు వద్ద నిర్వహించనున్న రాధాకృష్ణ మహోత్సవాల కరపత్రాలను జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు ఒమ్మి సన్యాసిరావు, బొట్ట వెంకటరమణ, ఉరుకూటి మహాలక్ష్మినాయుడు, పల్లా చిన్నతల్లి, తోనంగి వెంకటరమణి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పౌర్ణమి రోజున సాగరతీరంలో రాధాకృష్ణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

### బాలిక మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

**విశాఖ విద్య:** బాలిక మిస్సింగ్ కేసును గోపాలపట్నం పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సింహాచలం గోశాల ఏరియాలో నివసిస్తున్న సోమల తవశి తరచూ సెల్‌ఫోన్ చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. ఇంటి వద్దనే ఉంటున్న ఆ బాలిక ఎక్కువ సమయం ఫోన్‌లోనే గడుపుతుండటంపై గుర్తించిన తల్లిదండ్రులు తీరు మార్చుకోవాలని సూచించారు. ఆ కోపంతో ఆ బాలిక ఈ నెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రులు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక గురించి పూర్తి స్థాయిలో ఆరా తీశారు. సీఐ సూచనలతో ఎస్‌ఐ రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక ఉపయోగిస్తున్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమె ఉన్న చోటకు వెళ్లి స్టేషన్‌కు తీసుకొచ్చారు. బుధవారం వారి తల్లిదండ్రులను పిలిపించి బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి వారితో పంపించారు. బిడ్డను సకాలంలో గుర్తించి క్షేమంగా ఇంటికి చేర్చిన పోలీసులకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## అక్కయ్యపాలెంలో వ్యక్తి ఆత్మహత్య

**సీతమ్మధార :** అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం నందగిరినగర్ ప్రాంతంలో పి.సతీష్, పి.శ్రీదేవి జీవనం సాగిస్తున్నారు. సతీష్ సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 22న సాయంత్రం నుంచి శ్రీనివాస్ కనిపించకుండా పోయాడు. దీంతో అతని భార్య శ్రీదేవి చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికింది. బుధవారం ఉదయం ఆమె ఇంటి యజమాని వచ్చి సతీష్ పక్క గదిలో కేబుల్ వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. వెంటనే ఆమె అక్కడకు వెళ్లి పరిశీలించి... నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాగునీటి సరఫరాకు రేపు అంతరాయం

**సీతమ్మధార :** సీతమ్మధార టీపీటీ కాలనీలో పైప్ లైన్ మరమ్మతులకు గురైనందున జీవీఎంసీ 24, 26వ వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని మంచి నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు టి.ఎల్.సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, గాంధీనగర్, చైతన్యనగర్, క్రాంతినగర్, శారద స్కూలు ప్రాంతం, రామకృష్ణ నగర్, లలితా నగర్, శంకర మఠం మెయిన్ రోడ్, చిన్నూరు, మంగళవీధి తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు.

## టిడ్కో డిపాజిట్ల వాపస్ కోసం భారీగా జనం



డిపాజిట్ల వాపస్ కోసం జోన్ - 3 కార్యాలయంలో దరఖాస్తుదారులు

**సీతమ్మధార : టిడ్కో హౌసింగ్ డిపాజిట్ల వాపస్ కోసం జనం పోటెత్తారు. ఈ మేరకు ఆశీలమెట్టలో** గల జోన్ – 3 కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ కార్యాలయానికి బుధవారం అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు క్యూ కట్టారు. 2018 – 2019లో టిడ్కో ఇళ్ల కోసం అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జోన్ – 3 పరిధిలో ఉత్తర, తూర్పు నియోజకవర్గాల నుంచి 23 వేల మందితో అర్హుల జాబితా రూపొందించింది. జోన్ – 3 పరిధిలో 8,600 మంది డీడీలు చెల్లించి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పలు కారణాల చేత ఇళ్లు రానివారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల ముందు రూ.6 లక్షల వరకు డీడీలు వాపస్ చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ కారణంగా డిపాజిట్ల వాపస్‌కి బ్రేక్ పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు కొద్దిరోజులుగా డిపాజిట్లను వాపస్ చేస్తున్నారు. ఈ మేరకు జోన్ – 3కి రూ.75 లక్షలు విడుదల చేశారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, డిమాండ్ డ్రాఫ్ట్ జెరాక్స్, ఇతర డాక్యుమెంట్లతో డిపాజిట్ వాపస్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పట్లో దరఖాస్తుదారులు డిపాజిట్ కింద రూ.500, రూ.10 వేలు, రూ.12,500, రూ.25 వేలు డిపాజిట్లు చెల్లించారు. తూర్పు నియోజకవర్గంలో 3,210 మందికి, జోన్ – 3, 5 పరిధిలోని ఉత్తర నియోజకవర్గంలో 4 వేల మందికి టిడ్కో ఇళ్లు కేటాయించారు. డిపాజిట్ వాపస్ కోసం వచ్చిన వారి వివరాల నమోదు కోసం జోన్ – 3 కార్యాలయానికి సచివాలయాల నుంచి ఇద్దరు వెల్ఫేర్ కార్యదర్శులను కేటాయించారు. వీరు దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అలాగే దరఖాస్తుదారులకు బయోమెట్రిక్ విధానంలో ఫొటోలు తీస్తున్నారు. ఈ సందర్భంగా యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము దరఖాస్తుదారుల వివరాలు క్షుణ్ణంగా నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తుదారులకు మూడు రోజుల్లో డిపాజిట్లు వాపస్ చేస్తామని చెప్పారు.

## దళిత యువకుడి హంతకులను శిక్షించాలి



మాట్లాడుతున్న అప్పారావు, నాయకులు

**కంచరపాలెం :** దళిత యువకుడి హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కంచరపాలెం పరిధి ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వలంటీర్ అయినవిల్లి వాసు అనే దళిత యువకుడిని ప్లాన్ ప్రకారం హత్య చేసి తప్పించుకుంటున్న ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చా కామేశ్వరరావు, గొల్లమాల మీనా, పట్నాల ఝాన్సీ, లంకా రామారావు, సీతారామ్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చెత్త, వ్యర్థాలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



శాంతిపురంలో శుభ్రం చేసిన రోడ్డు

**సీతంపేట :** జీవీఎంసీ 25వ వార్డులో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను సిబ్బంది బుధవారం తొలగించారు. '25వ వార్డులో పడకేసిన పారిశుధ్యం' శీర్షికతో ఈ నెల 23న సాక్షిలో ప్రచురించిన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు స్పందించారు. శాంతిపురంలో పలు రహదారుల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు తొలగించి రోడ్లను శుభ్రం చేయించారు. మరలా ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా పారిశుధ్య సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.

## ప్రమాదకరంగా ఇనుప రాడ్లు



రోడ్డుపైనే వదిలేసిన ఇనుప రాడ్లు

**సీతమ్మధార :** రోడ్డుపైనే ఇనుప రాడ్లు వదిలేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాదచారులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్ మెయిన్ రోడ్డులో భవనం నిర్మిస్తున్నారు. ఇందుకోసం తీసుకొచ్చిన రాడ్లను పెద్ద మొత్తంలో రోడ్డుపైనే డంప్ చేయడం గమనార్హం. వాహనాల టైర్లు స్టీల్‌రాడ్లపైకి వెళ్లడంతో జారిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు హడలిపోతున్నారు. వర్షాలు కురిసినప్పుడు రాడ్లు కనిపించడం లేదని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. సీతమ్మధార సాయిబాబా గుడి నుంచి పోర్టు స్టేడియానికి వెళ్లే ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. డబల్ రోడ్డు అయినా సరే రోడ్డు సగానికిపైగా ఇనుప రాడ్లు ఆక్రమించడంతో కుచించుకుపోయిందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంత జరుగుతున్నా సమీపంలోని సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ద్వారకా స్టేషన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కార్మికుల వేతనాలు పెంచకుంటే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణ

**మల్కాపురం:** కోరమాండల్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. కార్మికుల వేతన సమస్యపై కోరమాండల్ గేటు వద్ద బుధవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న పలువురు కాంట్రాక్ట్ కార్మికులకు ఏడు సంవత్సరాల క్రితం వేతనాలు పెంచుతామని యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఆ ఒప్పందం నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోవడంతో కొనుగోలు చేయలేక కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సంస్థ క్యాంటీన్‌లో సరైన భోజనం అందించకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి గుడాల బాబూరావు, నూనెల సూరిబాబు, సత్యనారాయణరెడ్డి, కొయిలాడ శంకరావు పాల్గొన్నారు.